

వెంగమాంబ జయంత్యుత్సవాలు

తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో తరిగొండ వెంగమాంబ జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించారు. - 8లో



చెరువు కట్ట మట్టి తొలగింపు

చేపల కోసం పెళ్లకూరు మండలంలోని పెళ్లకూరు పెద్ద చెరువు కట్టను యంత్రాలతో తవ్వేశారు. - 8లో



చెదిరిన గూడు..తప్పదు తోడు

విదేశీ విహంగాలకు రక్షణ లేకుండా పోతోంది. వెదురుపట్టులో ఎర్రకాళ్ల కొంగల సంతానోత్పత్తికి ఆటంకం కలుగుతోంది. - 8లో

న్యూస్‌రీల్

పోలీస్ స్టేషన్ల ఆకస్మిక తనిఖీ



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైమ్: జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లను మంగళవారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. నగరంలోని ఈస్ట్, వెస్ట్, యూనివర్సిటీ, అలిపిరి పోలీస్ స్టేషన్లతో పాటు సాయుధ దళం ప్రధాన కార్యాలయాన్ని తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్లలోని రిసెప్షన్ కౌంటర్, సెక్షన్ ఇంచార్జ్ కౌంటర్, కంప్యూటర్ రూమ్ను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు, నేర నియంత్రణకు అవలంభిస్తున్న ప్రణాళికల గురించి అడిగి తెలుసుకున్నారు. స్టేషన్లో ఉన్న లోటుపాట్లను సరిచేస్తూ భవిష్యత్తు కార్యాచరణను వివరించారు. అనంతరం స్టేషన్లో పనిచేస్తున్న సిబ్బందితో ముచ్చటించి పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏవైనా ఉంటే నేరుగా తన దగ్గరికి తీసుకురావచ్చని సూచించారు. ఒత్తిడి లేకుండా పనిచేయాలని చెప్పారు. ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ కులశేఖర్, తిరుపతి డీఎస్పీ రవిమనోహరా చారి, సిబ్బంది ఉన్నారు.

తిరుపతి డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ రవిమనోహరాచారి

తిరుపతి క్రైమ్: తిరుపతి డీఎస్పీగా రవిమనోహరాచారి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఏసీబీ డీఎస్పీగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రంలో పనిచేయడం చాలాసంతోషంగా ఉందన్నారు. ఇంతకుముందు కూడా ఇక్కడే పనిచేశానని గుర్తుచేశారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ తమ వంతు సేవలందిస్తామని చెప్పారు.

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండాయి. క్యూ ఏటీసీ వద్దకు చేరింది. సోమవారం అర్ధరాత్రి వరకు 86,721 మంది స్వామివారిని దర్శించుకోగా 39,559 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.4 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

పకడ్బందీగా కౌంటింగ్ ప్రక్రియ

తిరుపతి అర్బన్: ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమారు తెలిపారు. మంగళవారం విజయవాడ ఏపీ సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తిరుపతి జిల్లాలో శాంతి భద్రతలు, విద్యుత్ సరఫరా, తాగునీరు, కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్‌కు కలెక్టర్ వివరిస్తూ జిల్లాలో తగినంత సీఏపీఎఫ్ బలగాలు వచ్చాయని, ఎస్పీ ఆధ్వర్యంలో పద్మావతి వర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాలకు విధులు కేటాయించామని చెప్పారు. 144 సెక్షన్ అమలులో భాగంగా మహిళా వర్సిటీ ప్రాంగణాన్ని నో డ్రోన్ ఫ్లయింగ్ జోన్‌గా చేర్చామని తెలిపారు. జిల్లాలో లూజ్ బాటిళ్లలో పెట్రోల్ అమ్మకాన్ని నిషేధించేందుకు చర్యలు తీసుకున్నట్టు వెల్లడించారు. కాన్ఫరెన్స్‌లో నగరపాలక కమిషనర్ అదితిసింగ్, ఎస్ఈ మోహన్‌రెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

28 నుంచి ఓపెన్ వర్సిటీ పరీక్షలు

తిరుపతి సిటీ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ మొదటి సంవత్సరం ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 28 నుంచి ప్రారంభమవుతాయని తిరుపతి రీజనల్ కో ఆర్డినేటర్ మల్లికార్జునరావు తెలిపారు. అభ్యర్థులు వర్సిటీ అధికార వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే డిగ్రీ అన్ని గ్రూపులకు సంబంధించిన హాల్ టికెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, మరిన్ని వివరాల కోసం ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ ప్రాంతీయ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.



తిరుపతి గ్రామదేవత శ్రీతాతయ్యగుంట గంగ జాతరకు భక్తులు పోటెత్తారు. జాతర చివరి రోజు కావడంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాతోపాటు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మొక్కుబడిలో భాగంగా మహిళలు వేపాకు చీరలు ధరించి.. ముఖానికి గంధపు బొట్లు పెట్టి.. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి మొక్కులు తీర్చుకున్నారు. మరికొందరు పొర్లుదండాలు పెట్టి అమ్మవారిని సేవించారు. ఇంకొందరు జంతు బలులిచ్చి, భక్తులకు విందు భోజనాలు వడ్డించారు. కాగా.. మంగళవారం అర్ధరాత్రి తర్వాత అమ్మవారి విశ్వరూప దర్శనానికి ఆలయ నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు.



నైవేద్యం సమర్పిస్తున్న భక్తులతో నిండిపోయిన తాతయ్యగుంట గంగమ్మ ఆలయం

వేపాకు చీరలు చుట్టి.. పొర్లు దండాలు పెట్టి!



కుటుంబ సమేతంగా గంగమ్మ సేవలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- జనజాతరతో పులకించిన తిరునగరి
- తాతయ్యగుంట గంగజాతరకు పోటెత్తిన జనం
- భక్తిపారవశంతో గంగమ్మకు పొంగళ్ల నివేదన
- జంతు బలులిచ్చి మొక్కులు తీర్చుకున్న స్థానికులు
- జాతర వేషాలతో సందడి చేసిన భక్తులు

తిరుపతి కల్చరల్: తిరుపతిలో జాతర కోలాహలం కొనసాగుతోంది. ఈనెల 14వ తేదీ రాత్రి చాటింపుతో మొదలైన గంగజాతర వారం రోజుల పాటు అత్యంత వైభవంగా సాగుతోంది. కనీవిని ఎరుగని రీతిలో రోజువారీ విభిన్న వేషాలతో భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. శ్రీతాతయ్యగుంట గంగ జాతరను ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తిరుపతి గ్రామదేవత గంగమ్మ ఆలయ విశిష్టత, జాతర వైభవాన్ని మరింత వ్యాప్తి చేసేందుకు కంకణ బద్ధులయ్యారు. అనంతరం ఆయన అమ్మవారికి సంప్రదాయబద్ధంగా సారెను సమర్పించి గంగ జాతర వైభవోపేతానికి శ్రీకారం చుట్టారు. తర్వాత వారం రోజుల పాటు శ్రీతాతయ్యగుంట గంగమ్మ తల్లికి సారె సంప్రదాయం కొనసాగింది. జాతర చివరి రోజు కావడంతో మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు గంగమ్మ ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.



వేపాకు చీరలు చుట్టి అమ్మవారికి మొక్కు చెల్లిస్తున్న భక్తులు

మహాశాంతి అభిషేకాలు

సోమవారం అర్ధరాత్రి తర్వాత అమ్మవారికి మహాశాంతి అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు వివిధ పౌరాణిక, జానపద, స్త్రీ వేషాలు ధరించి చిందులు వేస్తూ సందడి చేశారు. భక్తుల రద్దీ నేపథ్యంలో అధికారులు, పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఆలయం వద్ద భక్తులకు మజ్జిగ, అంబళ్లు పంపిణీ చేశారు.

విశ్వరూప దర్శనం..పులకించిన భక్తజనం

జాతర మహోత్సవంలో చివరి రోజు మంగళవారం అర్ధరాత్రి తర్వాత విశ్వరూపంతో అమ్మవారు కొలువుదీరనున్నారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. బంక మట్టితో అమ్మవారి విశ్వరూప ప్రతిమ కొలువుదీరనుంది. ఈ ప్రతిమ తయారీలో కుమ్మరి, కంసాలి, విశ్వబ్రాహ్మణ, చాకలి, దళితులు పాల్గొనడం ఆనవాయితీగా వస్తోంది. అమ్మవారి విశ్వరూప ప్రతిమ చెంపను పేరంటాల వేషధారుడు నరకడంతో జాతర సమాప్తం కానుంది.

గంగమ్మను దర్శించుకున్న ప్రముఖులు

తిరుపతి గ్రామదేవత శ్రీతాతయ్యగుంట గంగమ్మను పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఇందులో రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే రైల్వే కోడూరు ఎమ్మెల్యే కోరుముట్ల శ్రీనివాసులు, తిరుపతి జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ గంగమ్మతల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

209 పొట్టేళ్లతో ఎమ్మెల్యే భూమన విందు భోజనం

గంగమ్మ జాతర చివరి రోజున ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి భక్తులకు మాంసాహార విందు భోజనాలు వడ్డించారు. సుమారు 209 పొట్టేళ్లతో తయారు చేసిన మాంసాహార భోజనాలను గ్రూప్ థియేటర్ వద్ద ఎమ్మెల్యేతోపాటు మేయర్ డాక్టర్ శిరీష సారథ్యంలో భక్తులకు స్వయంగా వడ్డించారు. అలాగే ఇందిరా మైదానంలో డెప్యూటీ మేయర్, ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి సారథ్యంలో భక్తులకు మాంసాహార భోజనలు అందజేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు భక్తులకు మాంసాహార భోజనాలు నిరంతరంగా పంపిణీ చేశారు.



హారతి ఇస్తున్న డెప్యూటీ మేయర్ అభినయ్, పక్కన ఎమ్మెల్యే భూమన



సప్పరాలతో మొక్కు తీర్చుకుంటున్న భక్తులు


గంగమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి

శ్రీతాతయ్యగుంట గంగమ్మను ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా వెయ్యి కళ్ల దుత్తలను శిరస్సుపై పెట్టుకొని ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారి పట్ల తమ భక్తి తత్వాన్ని చాటుకున్నారు. అనంతరం తిరుపతి గ్రామ దేవత గంగమ్మ తల్లిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు



గంగమ్మ సేవలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి

నమో నారసింహా



హనుమంతుడిపై శ్రీరామచంద్రమూర్తి విహారం

- అంగరంగ వైభవంగా లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు
- హంస, హనుమంత వాహనాలపై ఊరేగిన దేవదేవుడు

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం స్వామివారు హంస వాహనంపై సరస్వతీ అలంకరణలో ఆశీనులై భక్తులను కటాక్షించారు. మేళతాళాలు, వేదమంత్రాలు, వేద పారాయణం నడుమ శ్రీవారు కోన మాడ వీధుల్లో విహరిస్తూ పారువేట మండపం వరకు క్షేత్రోత్సవం నిర్వహించారు. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

స్నపన తిరుమంజనం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా క్రేన్ మండపంలో మధ్యాహ్నం 12 గంటలకు స్నపన తిరుమంజనం కార్యక్రమాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. దేవదేవేరుల ఉత్సవ విగ్రహాలను పాలు, పెరుగు, తేనె, వివిధ రకాల పండ్ల రసాలు, చందనం, పసుపు, నారికేళంతో అభిషేకించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలు చేపట్టి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

లక్ష్మీనరసింహ హోమం

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని యాగశాలలో లక్ష్మీ నరసింహ హోమాన్ని నిర్వహించినట్లు టీటీడీ పండితులు రామానుజాచార్యుల స్వామి తెలిపారు. స్వామివారికి నిత్యం ఉదయం, సాయంత్రం యాగశాలలో హోమాలు నిర్వహించడం దేవస్థాన ఆచారమన్నారు.



హంస వాహనంపై లక్ష్మీనారసింహుడు



స్నపనతిరుమంజనంలో ప్రత్యేక అలంకరణ

నేడు గరుడవాహన సేవ

పెంచలకోన బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం సింహ వాహనసేవ, రాత్రి బంగారు గరుడ వాహన సేవ నిర్వహించనున్నారు.

వైభవంగా ఊంజల్‌సేవ

రాత్రి పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవేరులను తిరుచ్చిలో కొలువుదీర్చి వివిధరకాల పుష్పాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం మంగళవాయిద్యాలతో 1008 సహస్రదీపాలంకరణ మండపంలో ఉంచి ఊంజల్‌సేవ నిర్వహించారు.

స్వర్ణ హనుమంతునిపై శ్రీరామచంద్రమూర్తి

రాత్రి బంగారు హనుమంతసేవ అత్యంత వైభవంగా సాగింది. స్వామివారు మహావిష్ణువు ఆరవ అవతారమైన శ్రీరామచంద్రుని రూపంలో స్వర్ణ హనుమంతుడిపై కొలువదీరి తిరు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు.

తెలంగాణ సీఎంకు సాదర స్వాగతం



కాన్వాయ్‌లో బయటకు వస్తున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

రేణిగుంట: రేణిగుంట విమానాశ్రయంలో మంగళవారం సాయంత్రం తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం లభించింది. హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయం నుంచి ఆయన కుటుంబ సమేతంగా బయల్దేరి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. విమానాశ్రయం వెలుపల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు. తిరుమల శ్రీవారి దర్శనార్థం విచ్చేసిన ఆయన ప్రత్యేక కాన్వాయ్‌లో రోడ్డు మార్గాన బయల్దేరి తిరుమలకు వెళ్లారు.

అమ్మవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



శ్రీపద్మావతి అమ్మవారి ఆలయం వద్ద హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణప్రసాద్

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణప్రసాద్ కుటుంబ సభ్యులతో కలసి మంగళవారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని, అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

చెదిరిన గూడు.. తప్పదు తోడు!



ఎర్రకాళ్ల కొంగలు

ఖండాలను దాటుకుని.. సముద్రాలను ఈదుకుని.. వచ్చిన విహంగాలకు ఎలాంటి సంరక్షణా లేకుండా పోతోంది. అధికారుల అలసత్వం కారణంగా వలస పక్షులకు కనీసం విడిది కూడా లేకుండా అవస్థలు పడాల్సి వస్తోంది. ఇదెక్కడో కాదండోయ్.. దొరవారిసత్రం మండలం, వెదురుపట్టు ప్రాంతంలో.. ఆ కథా.. కమామిసేంటో మీరే చదవండి..!

- వెదురుపట్టులో ఎర్రకాళ్ల కొంగల సందడి
- డిసెంబర్ నుంచి ఇక్కడే బస
- విహంగాల సంరక్షణకు ప్రాధాన్యతనివ్వని వన్యప్రాణి విభాగం

దొరవారిసత్రం: మండలంలోని వెదురుపట్టు ఎర్రకాళ్ల కొంగ (పెయిడెండ్‌స్టార్క్)ల సంతానోత్పత్తికి మారుపేరు. నేలపట్టు, పులికాట్ ప్రాంతాల్లోని పక్షుల కేంద్రాలకు వచ్చే విదేశీ వలస విహంగాలకు భిన్నంగా కేవలం ఇక్కడకు ఎర్రకాళ్ల కొంగలు మాత్రమే వస్తుంటాయి. వీటి రాక డిసెంబర్, జనవరిలో మొదలై జూన్ నెలలో ముగుస్తుంది. ఈ దఫా వెదురుపట్టు పంచాయతీ పరిధి, కాళంగి నది ఒడ్డున ఆనుకుని ఉన్న నరసమాంబపుర అగ్రహారం గ్రామానికి గత ఏడాది డిసెంబర్‌లోనే విచ్చేశాయి. స్థానికంగా ఉన్న నాలుగు చింత చెట్లపై సుమారు 200 విహంగాలు బస చేస్తున్నాయి. ప్రస్తుతం ఈ విహంగాలు చింత చెట్లపై గూళ్లు కట్టుకుని.. పిల్లల్ని పొదిగి రెండు నెలలు గడిపోతోంది. గత సీజన్‌లో అయితే మార్చిలో విచ్చేసి సంతానోత్పత్తిని చేసుకుని తిరిగి వెళ్లాయి. కానీ ఈసారి డిసెంబర్‌లో నరసమాంబపుర అగ్రహారానికి విచ్చేశాయి. ఇవి ఇక్కడే సుమారు ఆరు నెలలు పాటు విడిది చేసి పిల్లలు ఎగిరే స్థాయిలోకి చేరుకోగానే తిరిగి ఆస్ట్రేలియాకు వెళ్లిపోతాయి. చేపల వేట మాత్రం పులికాట్ సరుస్సుతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో ఉన్న చెరువుల్లో కొనసాగిస్తాయి. వన్యప్రాణి సిబ్బందిని ఇక్కడ నియమించినప్పటికీ చుట్టపు చూపుగా వచ్చి వెళ్లిపోతారు తప్ప.. వాటికి ఎలాంటి రక్షణగా ఉండడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వెదురుపట్టు ప్రాంతానికి సంబంధిత అధికారులు కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదనే విమర్శలు ఎక్కుపెడుతున్నారు.



స్థానికులే సంరక్షులు

నరసమాంబపురఅగ్రహారానికి ఎర్రకాళ్ల కొంగలు ఎప్పుడు వచ్చినా స్థానికులే వాటిని సంరక్షిస్తుంటారు. ఈ ప్రాంతాన్ని వన్యప్రాణి విభాగం అధికారులు గుర్తించి సిబ్బందిని నియమించినా ఫలితం లేకపోతోంది. స్థానికంగా ఎవ్వరూ కనిపించకపోగా.. వెదురుపట్టు ప్రాంతం గురించి గానీ, ఈ ప్రాంత అభివృద్ధి గురించి గానీ సంబంధిత అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఎర్రకాళ్ల కొంగలు నివాసం ఉండే చింత చెట్లన్నీ అదే గ్రామానికి చెందిన ఒకరి ఇంటి ఆవరణలోనే ఉంటాయి. ఎవరూ ఈ పక్షులకు ఎలాంటి హానీ తలపెట్టరు.

వీటిని వీక్షించాలంటే...

నరసమాంబపురఅగ్రహారానికి బస్సు వసతి వంటివి ఏమీ లేవు. వాహనాల్లో వెళ్లక తప్పదు. దొరవారిసత్రం మండలం నెమిలమిట్ట అగ్రహారం గ్రామ సమీపంలోని జాతీయ రహదారి నుంచి వెదురుపట్టుకు రోడ్డు మార్గం ఉంది. జాతీయ రహదారి నుంచి 10 కి.మీ వరకు ప్రయాణం చేయాల్సి వస్తుంది. అంతేకాకుండా సూళ్లూరుపేట నుంచి తుంగమడుగు వెళ్లే ఆర్టీసీ బస్సు, ఆటోల్లో ఎక్కి నరసమాంబపురఅగ్రహారం రోడ్డు (సుమారు 15 కి.మీ) వద్ద దిగితే రెండు కి.మీ కాలినడక ఎర్రకాళ్ల కొంగలుండే ప్రాంతానికి చేరుకోవచ్చు.

ప్రాధాన్యత కల్పించాలి



వెదురుపట్టు ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన ఎర్రకాళ్ల కొంగలు ప్రతి ఏటా విచ్చేసి పిల్లలను పొదిగి సంతానం అభివృద్ధి చేసుకుని వెళ్తుంటాయి. నేలపట్టు, పులికాట్ పక్షుల కేంద్రాలకు ఏవిధంగా ప్రాధాన్యత ఉందో అదే తరహాలో ఈ ప్రాంతానికి ప్రాధాన్యత కల్పించాలి. అదేవిధంగా వెదురుపట్టు గురించి సంబంధిత అధికారులు ప్రచారం కూడా చేయాలి.

– ఎన్.మధుసూధన్‌రెడ్డి, సర్పంచ్, వెదురుపట్టు పంచాయతీ



తిరుపతి బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.76,590
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.6,841
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.95,700
రిటైల్ వెండి గ్రాము	రూ.97.70

పారిశుద్ధ్య కార్మికులపై దాడి

కోట: కోట పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులపై మంగళవారం గిరీష్‌కుమార్ అనే యువకుడు దాడికి పాల్పడ్డాడు. స్థానిక రవినగర్‌లో చెత్త ఎత్తేందుకు వాహనంతో పాటు వెళ్లిన ఏడుకొండలు, నరసమ్మ, తిరుపాలయ్య అనే కార్మికులపై మద్యం మత్తులో ఉన్న గిరీష్‌కుమార్ గొడవకు దిగి వారిపై దాడికి పాల్పడ్డాడు. దీంతో కార్మికులు విధులు బహిష్కరించి తమకు న్యాయం చేయాలంటూ పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఎస్సై నాగబాబుకు సర్పంచ్ వెంకటరమణమ్మ, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు. పోలీసులు గిరీష్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

పందెం రాయుళ్ల అరెస్ట్

వాకాడు: మండలంలోని నిమ్మవానితిప్ప గ్రామ సమీపంలో మంగళవారం కోడిపందేల స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నలుగురు జూదరులను అరెస్ట్ చేయడంతోపాటు నాలుగు కోళ్లు, రూ.4 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. ఎవరైనా చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

మద్యం మత్తులో అన్నపై దాడి

నాయుడుపేటటౌన్: మద్యం మత్తులో సొంత అన్నపై తమ్ముడు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన మంగళవారం మండల పరిధిలోని గొట్టిప్రోలు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. ఈనెల 19 తేదీన గొట్టిప్రోలు గ్రామంలో దార్ల విజయ్‌కుమార్ అతిగా మద్యం సేవించి అతని అన్న ఇంటికి వెళ్లి వదినతో గొడవపడి దాడికి యత్నించాడు. ఆపై అన్న దార్ల చెంగయ్యపైనా ఇటుక రాయి తలపై మోది తీవ్రంగా గాయపరిచాడు. అడ్డు వెళ్లిన వదినపై కూడా దాడికి పాల్పడ్డాడు. గాయపడిన అన్న, వదినను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు బాధితులు మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఘనంగా తరిగొండ వెంగమాంబ జయంత్యుత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న టీటీడీ జేఈఓ గౌతమి, అతిథులు

తిరుపతి కల్చరల్: శ్రీవారి అపర భక్తురాలైన భక్త కవయిత్రి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 294వ జయంతి ఉత్సవాలు మంగళవారం అన్నమాచార్య కళామందిరంలో మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలకు టీటీడీ జేఈఓ గౌతమి ముఖ్యఅతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ తరిగొండ వెంగమాంబ శ్రీవారిపై భక్తి శ్రద్ధలతో అనేక సంకీర్తనలను రచించారన్నారు. వెంగమాంబ సాహిత్యాన్ని, రచనలు, కీర్తనలను జన బాహుళ్యంలోకి తీసుకెళ్లేందుకు టీటీడీ కృషి చేస్తోందని తెలిపారు. ముత్యాల హారతి రూపంలో శ్రీవారిలో ఐక్యమయ్యారని కొనియాడారు. అనంతరం జరిగిన సాహితీ సదస్సుకు అధ్యక్షత వహించిన అనంతపురం ఎస్కే వర్సిటీ మాజీ ఉపకులపతి డాక్టర్ కుసుమకుమారి మాట్లాడుతూ టీటీడీ తరిగొండ వెంగమాంబ ప్రాజెక్టు ఏర్పాటు చేసి ఆమె సాహిత్యాన్ని, రచనలను వెలుగులోకి తీసుకొచ్చినట్టు వెల్లడించారు.

ఎస్వీ భక్తి చానల్ చైర్మన్ డాక్టర్ సాయికృష్ణయాచేంద్ర తరిగొండ వెంగమాంబ– జీవన గానం అనే అంశంపై ఉపన్యసించారు. అన్ని వర్గాల ప్రజలు అర్థం చేసుకునేందుకు వీలుగా జనరంజకమైన భాషలో వెంగమాంబ రచనలు చేశారని తెలిపారు. వెంగమాంబ పాటలు, సామాన్య జనులు పాడుకునే విధంగా ఉంటాయన్నారు. ప్రతి పాటలో భక్తి, చైతన్య వంతమైన భావాలు కనిపిస్తాయన్నారు. నెల్లూరుకు చెందిన ప్రాచీన విశిష్ట అధ్యయన కేంద్రం డాక్టర్ లోకేశ్వరి తరిగొండ వెంగమాంబ– సాహిత్యం– ప్రత్యేకత అనే అంశంపై ఉపన్యసించారు. అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు డాక్టర్ ఆకెళ్ల విభీషణశర్మ తరిగొండ వెంగమాంబ–రచనలలో వైవిధ్యం అనే అంశంపై ప్రసంగించారు. వెంగమాంబ మొత్తం 18 రచనలు చేయగా, ఇందులో శ్రీవేంకటాచల మహత్యం గ్రంథం చిరస్థాయిగా నిలిచిపోయిందని తెలిపారు. దీనికి ముందు శ్రీవారు, తరిగొండ వెంగమాంబ చిత్రపటాలకు పూజలు నిర్వహించారు. అనంతరం తరిగొండ వంశీయులు శ్రీవిష్ణుమూర్తి, నాగరాజురావు, సాహిత్య సదస్సులో పాల్గొన్న పండితులను ఆత్మీయంగా సత్కరించారు. కాగా సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ సాయికృష్ణ యాచేంద్ర, హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి బృందం ఆలపించిన భక్తి సంకీర్తనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో శ్వేత సంచాలకులు భూమన్, భక్తులు పాల్గొన్నారు.

యంత్రాలతో చెరువుకట్ట తొలగింపు



తొలగించిన చెరువుకట్టను పరిశీలిస్తున్న అధికారులు

పెళ్లకూరు: మండలంలోని చిల్లకూరు గ్రామ పెద్ద చెరువుకట్టను చిల్లకూరు వడ్డిపాళెం ప్రాంతానికి చెందిన రమణయ్య యంత్రాలతో తొలగించాడు. అనధికారికంగా నిర్వహించిన చేపల చెరువు వేలం పాటలో భాగంగా చేపలు పట్టుకోవడానికి ఇలా తవ్వకాలు చేపట్టినట్టు గ్రామస్తులు ఆరోపించారు. ఈ మేరకు ఇరిగేషన్ ఏఈ మహేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీహరి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. చెరువుకట్టను రెండు చోట్ల యంత్రాలతో తొలగించినట్టు గుర్తించారు. యంత్రాలతో, చెరువుకట్టను తొలగించిన రమణయ్యపై సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్టు ఏఈ తెలిపారు.

ఇసుక రీచ్‌ల పరిశీలన




కాశీపురం వద్ద ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈబీ ఏఎస్పీ రాజేంద్ర

వాకాడు: వాకాడు మండలంలోని ఇసుక రీచ్‌లను మంగళవారం తిరుపతి జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంటు బ్యూరో(ఎస్ఈబీ) ఏఎస్పీ రాజేంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వాకాడు, కాశీపురం స్వర్ణముఖి నది, బసమ్మ కండ్రిగ, కోట మండలంలోని గూడలి ప్రాంతాల ఇసుక రీచ్‌లను పరిశీలించారు. ఆయన వెంట వాకాడు ఎస్ఈబీ సీఐ శ్రీనివాసులుతోపాటు, ఇరిగేషన్, మైనింగ్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

గాయపడిన మహిళ మృతి

నాయుడుపేట టౌన్ : రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతిచెందింది. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. పోలీసుల కథనం.. గత కొన్నేళ్లుగా పట్టణంలోని సంజయ్‌గాంధీ కాలనీలో మునెమ్మ(54) ఒంటరిగా నివాసం ఉంటోంది. ఈనెల 18 తేదీ రాత్రి ఇంటికి వెళ్లేందుకు తుమ్మూరు సమీపంలో ఉన్న రాజీవ్‌గాంధీ కాలనీ వద్ద రోడ్డు దాటుతుండగా అదే ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి బైక్‌పై వేగంగా వచ్చి మునెమ్మను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానిక వైద్యశాలలో ప్రథమ చికిత్స అందించారు. ఆపై మెరుగైన వైద్యం కోసం తిరుపతి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. కాగా.. అక్కడ ఆమె చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందింది. మృతురాలి అక్క లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గోడకూలి ముగ్గురికి గాయాలు



గాయపడినవారిని ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

చిత్తూరు అర్బన్: నగరంలోని బాపుబాల భవన్ పాఠశాల వీధిలో ఓ గోడ కూలడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సమీపంలో గంగాధర నెల్లూరు మండలం నెల్లేపల్లెకు చెందిన గోపి (36) డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఆయన, తన స్నేహితుడు వినోద్, ఓ పెద్దాయన మొదటి అంతస్తులోని ఓ షెడ్డులో పత్రాలు రాస్తున్నారు. ఉన్నట్టుండి కురిసిన వర్షానికి తొమ్మిది అడుగుల ఎత్తులో ఉన్న సిమెంటురాళ్ల గోడ కూలిపోయింది. ఈ ప్రమాదంలో ముగ్గురూ కూడా రాళ్ల కింద చిక్కుకున్నారు. బాధితుల కేకలు వేయడంతో స్థానికులు హుటాహుటిన వెళ్లి వారిని రాళ్ల కింద నుంచి బయటకు తీసుకువచ్చారు. 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

గ్రూప్‌-2 మెయిన్స్‌కు ఉచిత శిక్షణ

తిరుపతి అర్బన్: ఏపీపీఎస్సీ ఇటీవల విడదల చేసిన గ్రూప్‌–2 ప్రిలిమ్స్ ఫలితాలలో ప్రతిభ చూపి మెయిన్స్ పరీక్షలకు అర్హత సాధించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు తిరుపతి ఏపీ బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంచాలకులు డీ.భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడెటాతో పాటు గ్రూప్‌–2 హాల్‌టికెట్, ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ మార్కులు జాబితాలు, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, బ్యాంక్ పాస్‌బుక్, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డుతో ఈ నెల 25లోపు ఎమ్ఆర్‌పల్లిలోని బీసీ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు 60 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, శిక్షణ కాలంలో స్టైఫండ్ ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9346221553, 9441456039 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మళ్లీ ఫ్యాన్ ప్రభంజనమే

- అత్యధిక మెజార్టీతో గెలవబోతున్నాం
- వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి వెల్లడి



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి(సైదాపురం): రాష్ట్రంలో మళ్లీ ఫ్యాన్ ప్రభంజనమేనని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. వెంకటగిరి నియోజకవర్గంలో తాను అత్యధిక మెజారిటీతో గెలవనున్నట్టు వెల్లడించారు. వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఈనెల 13న జరిగిన ఎన్నికల్లో వృద్ధులు, వికలాంగులను పోలింగ్ బూత్‌ల వద్దకు తీసుకురావడంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎనలేని కృషి చేశారన్నారు. రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించబోతోందని చెప్పారు. పేదలకు మేలు చేసే ప్రభుత్వాన్ని ప్రజలు ఎప్పుడూ గుర్తుపెట్టుకుంటారని తెలిపారు. అంతేగాకుండా రూ.25వేలకంటే తక్కువ వేతనం ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు అన్ని రకాల ప్రభుత్వ పథకాలను వర్తింపజేసే విధంగా మేనిఫెస్టో రూపొందించారని, దీనిపై ఉద్యోగుల నుంచి మంచి స్పందన వస్తోందన్నా. తాను సమన్వయకర్తగా ఉన్న సమయంలో వెంకటగిరికి తీసుకొచ్చిన సెంట్రల్ లైటింగ్ ఎంతో ఆకర్షణీయంగా నిలిచిందన్నారు.

అన్యాయంగా జైలుకు పంపారు!

- నాని కారుపై జరిగిన దాడిలో మా వాళ్లు లేరు
- విచారించి పంపుతామని తీసుకొచ్చి కేసు పెట్టారు
- ఎస్పీకి విన్నవించిన బాధిత కుటుంబీకులు



ఎస్పీని కలిసి బయటకు వస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

తిరుపతి క్రైమ్: 'ఎన్నికల అనంతరం నాని కారుపై జరిగిన దాడిలో మా వాళ్లు ఎవ్వరూ లేరు. కానీ పోలీసులు మా వాళ్లను తీసుకొచ్చారు. విచారించి పంపుతామని కేసులు పెట్టి జైలుకు తరలించారు. న్యాయం చేయండి' అంటూ బాధిత కుటుంబీకులు ఎస్పీని వేడుకున్నారు. మంగళవారం రామచంద్రాపురం మండలం, అనుప్పల్లి పంచాయతీకి చెందిన బాధిత కుటుంబాలు ఎస్పీ కార్యాలయానికి విచ్చేసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. తిరుపతి పద్మావతీ యూనివర్సిటీ ఆవరణలో ఈనెల 14వ తేదీన చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిపై జరిగిన దాడి కేసులో రామచంద్రాపురం మండలం, అనుప్పల్లి పంచాయతీ, గడ్డకిందపల్లికి చెందిన ఎద్దుల భాస్కర్‌రెడ్డి, సాంబశివారెడ్డిని పోలీసులు అరెస్టు చేసి కడప జైలుకు తరలించారు. అయితే ఈ ఘటనలో వారికి సంబంధం లేదని కుటుంబీకులు ఎంత చెప్పినా పోలీసులు వినిపించుకోలేదు. ఆ సమంలో వారు యూనివర్సిటీ వద్ద లేరన్న ఆధారాలను సేకరించుకున్న బాధిత కుటుంబీకులు తిరుపతి అర్బన్ జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చారు. అనంతరం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజును కలసి వినతి పత్రం అందించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. సంబంధం లేని కేసులో తమ వారిని ఇరికించి జైలుకు పంపించారని ఫిర్యాదు చేశారు.

దాడి జరిగిన సమయంలో భాస్కర్‌రెడ్డి ఎల్ఐసీ ఆఫీసులో ఉన్నట్టు అక్కడ సీసీ టీవీ ఫుటేజీలో కూడా ఉందని, అలాగే సాంబశివారెడ్డి ఇంటి దగ్గర ఉన్నారన్న ఆధారాలు కూడా ఉన్నాయని వివరించారు. ఈ విషయంపై స్పందించిన ఆయన ఆ కేసులో వారికి సంబంధం లేదని నిర్ధారించుకున్న తర్వాత తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో బాధిత కుటుంబీకులు అక్కడి నుంచి వెళ్లారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ తమ వాళ్లకు ఎలాంటి సంబంధం లేకపోయినా అన్యాయంగా లోపల పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి బిడ్డలు గత నాలుగు రోజులుగా ఏడుస్తూనే ఉన్నారని, తండ్రి కోసం అలమటిస్తున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. ఎస్పీని కలసిన వారిలో భాస్కర్ రెడ్డి సోదరి సుమతి, సాంబశివారెడ్డి సతీమణి రోహిణితోపాటు ఇతర కుటుంబ సభ్యులు ఉన్నారు.